సాక్షి
అనంతపురం
బుధవారం। 29। నవంబర్। 2023



జిల్లాకు వర్ష సూచన
ఉమ్మడి జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.



టమాట కిలో రూ.24
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.24 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/19.1°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

4న రాప్తాడులో సామాజిక సాధికార యాత్ర



తగరకుంటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న ప్రభుత్వంలో కలిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర డిసెంబర్ నాలుగో తేదీ రాప్తాడులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కనగానపల్లి మండలం మద్దెల చెరువు, భానుకోట, కేఎన్ పాళ్యం, నరసంపల్లి, తగరకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతీ ప్రసాద్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నిర్వహణకు అనుమతి



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ జింకా రంగజనార్ధన, రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం స్నాతకోత్సవం నిర్వహించడానికి గవర్నర్/ఛాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చారు. వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ రాజభవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. స్నాతకోత్సవ నిర్వహణకు ఆయన సమ్మతించారని, తేదీ త్వరలోనే ఖరారు చేస్తామన్నారని వీసీ వెల్లడించారు.

అందరికీ ఆమోదయోగ్యంగానే అర్బన్ లింక్ రోడ్లు



ముస్లిం పెద్దలు, ప్రతినిధులతో సమావేశమైన ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్

అనంతపురం కార్పొరేషన్/ టౌన్: నగర ప్రజలందరికీ ఆమోదయోగ్యంగానే అర్బన్ లింక్ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ పేర్కొన్నారు. మంగళవారం డ్వామా కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ కేతన్‌గార్గ్ అధ్యక్షతన అర్బన్ లింక్ రోడ్లపై సలహాలు, సూచనలపై సమావేశం నిర్వహించారు. పలువురు ముస్లిం మత పెద్దలు తమ అభిప్రాయాలు, సూచనలను అర్జీల ద్వారా సమర్పించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ అర్జీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జాతీయ రహదారుల అధికారులతో చర్చించి అర్బన్ లింక్ రోడ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మహ్మద్ రఫీ, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, జాతీయ రహదారుల ఈఈ మధుసూదన్‌తో పాటు ముస్లిం మత పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు భారీ ప్రాజెక్టు

జిల్లాలో భారీ ప్రాజెక్టుకు ముందడుగు పడింది. రాష్ట్రంలోనే అత్యంత భారీ వ్యయంతో నిర్మించే శింగనమల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. విద్యుత్ ఉత్పత్తి, సాగునీటికి ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడనుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ భారీగా రానున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోంది.

- నాయనివారిపల్లి వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు
- 480.65 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మాణం
- 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శింగనమల మండలం నాయనివారిపల్లి సమీపంలో శింగనమల పంప్డ్ స్టోరేజీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు అంటే ఎగువన (కొండపై) 54 మీటర్ల గరిష్ట ఎత్తులో ఆనకట్ట నిర్మించి.. దిగువ ఉన్న జలాశయాల నుంచి నీటిని పైకి లిఫ్ట్ చేస్తారు. వర్షాకాలంలో మిగులు జలాలను ఈ రిజర్వాయర్‌కు తరలించి, వేసవిలో ఈ నీటిని దిగువకు పంపే క్రమంలో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు సాగునీటి అవసరాలకు వాడతారు. దిగువ జలాశయాల నుంచి పగటి పూట సౌరవిద్యుత్ సాయంతో నీటిని ఎగువ రిజర్వాయర్‌కు పంపిస్తారు.


కొండల్లో నిర్మాణం

800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టును 480.65 హెక్టార్ల విస్తీర్ణంలో కొండల్లో ఏర్పాటు చేస్తారు. దీనికోసం సొరంగాలు, పవర్‌హౌస్ కాంప్లెక్స్, వాటర్ కండక్టర్ సిస్టంలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో అటవీ భూమి 232.33 హెక్టార్లు ఉన్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. ఇక్కడ వన్యప్రాణుల ఆవాసాలు లేవని గుర్తించిన తర్వాతే ప్రాజెక్టు అవసరాలకు ఈ భూమిని వాడుతున్నట్టు అటవీ శాఖ పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కానీ, ప్రాజెక్టు పూర్తయి అమలు దశలో గానీ కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తూ పర్యావరణానికి ప్రయోజనం చేకూర్చే ప్రక్రియ చేపడతామని ప్రాజెక్టు డీపీఆర్‌లో స్పష్టం చేశారు.

పారిశ్రామిక రంగానికి ఊతం

హైడ్రో ప్రాజెక్టు వల్ల విద్యుత్, సాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అనుబంధ రంగాలు బలోపేతమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నికరమైన విద్యుచ్ఛక్తి అందుబాటులో ఉన్నప్పుడు కుటీర పరిశ్రమలు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత సానుకూల వాతావరణం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి కోసం 10 కిలోమీటర్ల పొడవునా 25వేల చెట్లను పెంచనున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపల అభివృద్ధికి రూ.152 లక్షలు, విపత్తుల నిర్వహణకు రూ.110 లక్షలు కేటాయిస్తున్నట్టు డీపీఆర్‌లో పేర్కొన్నారు.

ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం	నాయనివారిపల్లి
ప్రాజెక్టు పేరు	ఎస్‌పీఎస్‌పీ (శింగనమల పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టు)
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	800 మెగావాట్లు
ప్రాజెక్టు వ్యయం	రూ.4,676.64 కోట్లు
ప్రాజెక్టుకు అవసరమయ్యే భూమి	480.65 హెక్టార్లు
కొండపై ఆనకట్ట ఎత్తు	54 మీటర్లు
నిల్వ సామర్థ్యం	33 మీటర్లు
ప్రాజెక్టు నిర్మాణ దశలో పనిదినాలు	13,14,000
ప్రాజెక్టు ఆపరేషన్ దశలో పనిదినాలు	29,20,000



మెగా ప్రాజెక్టును స్వాగతిస్తున్నాం

శింగనమల: నాయనవారిపల్లి కొండల వద్ద నిర్మించబోయే శింగనమల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును నాయనవారిపల్లి, ఆనందరావుపేట, రాచేపల్లి గ్రామస్తులు స్వాగతించారు. ప్రాజెక్టు ఏర్పాటుపై మంగళవారం నాయనవారిపల్లి వద్ద పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆర్డీఓ జి.వెంకటేష్, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి 0.73 టీఎంసీలు, 0.59 టీఎంసీల స్థూల నిల్వ సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎవరికీ నష్టం కలగకుండా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం నాయనవారిపల్లి, ఆనందరావుపేట, రాచేపల్లి గ్రామస్తులు ప్రాజెక్టును స్వాగతిస్తున్నామని తెలిపారు. తమ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. తమ భూముల్లో పైపులైను వెళ్లినా పరిహారం అందించాలన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. గంపమల్లయ్య స్వామి ఆలయం వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్డీఓ జి.వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ ఏఈఈ కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.




నాయనివారిపల్లి వద్ద మంగళవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేష్

రైతును రాజుగా చూడాలి



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కళ్యాణదుర్గం రూరల్: రైతును రాజుగా చూడాలనేదే జగనన్న లక్ష్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. గరుడాపురం పంచాయతీలో కృషి విజ్ఞాన కేంద్రం సమీపాన రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఆర్బీకేల ద్వారా వ్యవసాయ సేవలను రైతు ముంగిటకు తీసుకొచ్చిందన్నారు. అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు అవసరమైన చోట్ల సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వైఎస్సార్ బాటలోనే సీఎం జగనన్న కూడా పయనిస్తూ మన్ననలు పొందుతున్నారన్నారు. టీడీపీ పాలనలో రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. కరెంటు బిల్లులు కట్టలేదని రైతులను జైలుకు పంపిన చరిత్ర టీడీపీదని విమర్శించారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఇప్పటికే నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జెడ్పీటీసీ బొమ్మన్న, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ లక్ష్మీ కాంతమ్మ, విద్యుత్ ఈఈ శేషాద్రి శేఖర్, డీఈఈ గురురాజ్, ఏఈ సలీమ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తం, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, నాయకులు సుధీర్, ముదిగల్లు నరేంద్రరెడ్డి, హనుమంతురాయుడు పాల్గొన్నారు.

నేడు తాడిపత్రిలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: 'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి కార్యక్రమాన్ని బుధవారం తాడిపత్రిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు 'జగనన్నకు చెబుదాం', 'స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పొరపాట్లకు తావివ్వకూడదు

- నిబంధనలు పాటించండి
- క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టాలి
- దరఖాస్తులు పక్కాగా పరిశీలించండి
- ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన క్లెయిమ్‌ల పరిష్కారంలో పొరపాట్లకు తావివ్వకూడదని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ అంశంపై అబ్జర్వర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గౌతమితో కలసి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ ప్రక్రియ, నిబంధనలను అమలు చేయాలని ఆదేశించారు. కొత్త ఓటరు నమోదు, ఓట్ల తొలగింపు దరఖాస్తుల పరిశీలన నిక్కచ్చిగా చేయాలన్నారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సర్వే చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఫిర్యాదులను ముందుగానే అందించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధులు డిసెంబరు 20న రాష్ట్రానికి వస్తారన్నారు. అప్పటికి క్లెయిమ్‌లు పరిష్కరించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓట్ల తొలగింపు క్లెయిమ్‌లను పరిష్కరిస్తున్నామని కలెక్టర్ గౌతమి తెలిపారు. దరఖాస్తులను మరోసారి పరిశీలించేందుకు వచ్చేవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే కొత్త ఓటరు నమోదుకు డ్రైవ్ చేపడుతామన్నారు. సమావేశంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, రాణీసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర, సుధారాణి, కరుణ కుమారి, వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూలే చొరవతోనే మహిళల జీవితాల్లో వెలుగులు



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టర్ గౌతమి తదితరులు

అనంతపురం సిటీ: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే చొరవతోనే మహిళల జీవితాల్లో వెలుగులు వచ్చాయని కలెక్టర్ గౌతమి అన్నారు. మహిళలకూ విద్య అవసరమని గుర్తించి, పోరాడిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, నగర మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి పూలే విగ్రహానికి, చిత్రపటానికి వేర్వేరుగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే మహిళల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడమే గాక తొలిసారి తన భార్యతోనే అక్షరాభ్యాసం మొదలు పెట్టడం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిందన్నారు. ఆయన చొరవతోనే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా చేసుకొని నిస్వార్థ జీవితాన్ని గడిపిన జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ సమాన హక్కులతో పాటు కుల వ్యవస్థ నిర్మూలనకు, అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి పాటుపడి అందరికీ ఆదర్శప్రాయుడిగా పూలే నిలిచిపోయారని కొనియాడారు. పూలే స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ కూడా విద్య, వైద్యం, మహిళా సాధికారతకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితా బాయి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరా, పార్టీ అనుబంధం మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మహిళా విభాగం ప్రతినిధులు కృష్ణవేణి, శ్రీదేవి, రాధ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దీవెనలతో 'గడప గడప' పూర్తి

- మురడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా

రాయదుర్గం: ప్రతి ఇంటా ఘన స్వాగతం.. ఆత్మీయ ఆదరణ, ఆప్యాయతతో కూడిన పలకరింపుల నడుమ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం నియోజకవర్గంలో 540 రోజులపాటు సాగించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ప్రజాదీవెనలతో మంగళవారం ముగిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 96 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని 265 గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు విప్ కాపు కృతజ్ఞతలు తెలిపారు. డి.హీరేహాళ్ మండలం మురడిలో ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులంతా తరలివచ్చారు. బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 18 నెలలపాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాయదుర్గం చరిత్రలోనే 1,02,569 గడపలు తొక్కిన ఏకైక ఎమ్మెల్యే తానే కావడం గర్వంగా ఉందని చెప్పారు. సంక్షేమంలో సరికొత్త విప్లవానికి సీఎం జగన్ నాంది పలికారని పేర్కొన్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా కృషి చేశారని కొనియాడారు. ప్రతి కుటుంబానికీ రూ.2లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా పథకాల ద్వారా లబ్ధి కలిగిందన్నారు.

పాలనలో తేడా గమనించండి

టీడీపీ - వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను ప్రజలు గమనించాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు చంద్రబాబు, కాలవ శ్రీనివాసులు ప్రజాధనాన్ని భారీ స్థాయిలో దోపిడీ చేశారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో 650 హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. మరోసారి ఉత్తుత్తి హామీలతో మీ ముందుకు వచ్చే టీడీపీ దొంగలను ఎక్కడికక్కడ అడ్డుకుని, గత ఎన్నికల హామీలు ఏమయ్యాయో నిలదీయాలని పిలుపునిచ్చారు. అనంతరం పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడటంతో 'పచ్చ' దొంగల హడావుడి పెరిగిందని, వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్ స్వామి, మురడి సర్పంచ్ గంగప్ప, మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు పాల్గొన్నారు.

మురడిలో టీడీపీకి బిగ్ షాక్

మురడి గ్రామంలో టీడీపీకి బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వ్యవహారశైలి నచ్చక పలువురు టీడీపీకి రాజీనామా చేసి విప్ కాపు రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నాయకులు టి.ధనుంజయ్య, టి.తిప్పేస్వామి, మార్తల్ వెంకటేశులు, ఆర్‌బీ వంక తిప్పేస్వామి, తమ్మేపల్లి చంద్ర, సత్తి, చాకలి పరమేష్, వారి అనుచరులకు కాపు, పైలా నరసింహయ్యలు కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

క్లుప్తంగా

రూ.13.51 లక్షల విలువైన మద్యం ధ్వంసం



ధ్వంసం చేసేందుకు తెచ్చిన మద్యం బాక్స్‌లను పరిశీలిస్తున్న సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ

కళ్యాణదుర్గం: స్థానిక సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.13,51,774 విలువైన కర్ణాటక మద్యాన్ని జేసీబీ సాయంతో పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. ఈ ప్రక్రియను జిల్లా సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, సీఐ సోమశేఖర్, పట్టణ సీఐ హరినాథ్, ఎస్‌ఐ సుధాకర్ తదితరులు పరిశీలించారు.

వృద్ధురాలి బలవన్మరణం



నరసమ్మ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన నరసమ్మ (70) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం బద్దలాపురం గ్రామానికి చెందిన నరసమ్మకు 40 ఏళ్ల క్రితం ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామానికి చెందిన నరసింహులుతో వివాహమైంది. పెళ్లి తర్వాత రెండేళ్లు కలిసే ఉన్న వీరు ఆ తర్వాత వ్యక్తిగత కారణాలతో విడిపోయారు. అప్పటి నుంచి నరసమ్మ బద్దలాపురంలోనే నివాసముంటోంది. నాలుగు నెలల క్రితం భర్త నరసింహులు చనిపోవడంతో మదిగుబ్బకు చేరుకుంది. ఈ క్రమంలోనే భర్త ఆలోచనలతో దిగాలు చెందిన ఆమె మంగళవారం ఉదయం గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జిల్లాకు బదిలీపై తహసీల్దారు భాస్కర్

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు తహసీల్దారు భాస్కర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో మంగళవారం ఉదయం కలెక్టర్ ఎమ్.గౌతమి వద్ద ఆయన రిపోర్ట్ చేసుకున్నారు. గతంలో ఆయన ఎన్నికల విభాగంలో విధులు నిర్వర్తించిన నేపథ్యంలో కేఆర్‌సీసీ తహసీల్దారుగా లేదా కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చి ఎన్నికల విభాగం బాధ్యతలు అప్పగించవచ్చునని అధికారవర్గాల సమాచారం.

ఆదర్శప్రాయుడు పూలే

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శప్రాయమని, ఆయన ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం లోని తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావుపూలే చేసిన కృషిని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్ కూడా అదే బాటలో నడుస్తూ విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు సమూలంగా మార్చేశారన్నారు. కార్పొరేట్ స్థాయి సౌలభ్యాలను పేదలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రాజకీయంగానూ బడుగులకు సముచిత స్థానం కల్పించారన్నారు. మహిళలకు రిజర్వేషన్‌ను కల్పించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు కట్టబెట్టారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. కులవివక్షను వ్యతిరేకించిన వారిలో మహాత్మా జ్యోతిరావు పూలే ముఖ్యులన్నారు. అందరికీ సమాన అవకాశాలు రావాలని పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం దక్కిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర రెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, జోనల్ ఇన్‌చార్జ్‌లు రిలాక్స్ నాగరాజు, రాజారాం, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, కృష్ణవేణి, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, పామిడి వీరాంజనేయులు, వేముల నదీం, అనిల్‌కుమార్‌గౌడ్, రామచంద్రారెడ్డి, భారతి, రాధాయాదవ్ పాల్గొన్నారు.

దార్శనికుడు జ్యోతిరావు పూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కళ్యాణదుర్గం: బడుగు, బలహీన వర్గాలకు దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి మంత్రి, ఎమ్మెల్సీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి కోసం పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సర్వోత్తమ, నాయకులు బ్రహ్మయ్య, భట్టువానిపల్లి అంజి, హనుమంతరాయుడు, ఉమేష్‌రెడ్డి, మల్లికార్జున, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస నగర్‌లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనివాస నగర్‌లో నివాసముంటున్న న్యాయవాది ఆనంద్ ఇంట్లో దొంగలు పడ్డారు. సోమవారం ఆనంద్, తన భార్య సుజాతతో కలసి శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన గ్రిల్ తాళాలు బద్దలుగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన దంపతులు లోపలకు వెళ్లి పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం అందించడంతో త్రీ టౌన్ సీఐ ధరణీకిషోర్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమార్తెను పలకరించి త్వరగా వద్దామని భావనతో ఇంటి మెయిన్ డోర్‌కున్న గ్రిల్‌కు మాత్రమే తాళం వేసి ఊరెళ్లినట్లుగా గుర్తించారు. అయితే అనుకున్న సమయానికి వారు రాలేకపోవడం దొంగలకు అనువుగా మారిందన్నారు. బీరువాలోని 7 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి సామగ్రిని అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అవి పనిచేయలేదు. దీంతో చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నగలు, నగదు అపహరణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రోషమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఇంటి తాళాలను పగులగొట్టి లోనికి చొరబడిన దుండగులు బీరువాలోని అర తులం బంగారు కమ్మలు, రూ.40 వేలు నగదు అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

పెద్దవప్పూరు: జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని సకాలంలో పోలీసులు కాపాడారు. యువకుడిని యాడికి గ్రామానికి చెందిన రంగస్వామిగా గుర్తించారు. జూటూరు రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోతుండగా స్టేషన్ మాస్టర్ గుర్తించి, పోలీసుల సాయంతో అడ్డుకున్నారు. అనంతరం యువకుడికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వం దృష్టికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్.ఎస్.దివాకర్‌రావు పేర్కొన్నారు. అనంతపురంలోని కృష్ణకళామందిర్ ఆవరణలో ఉన్న రెవెన్యూభవన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రథమ మహాసభ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో దివాకర్ రావు, సురేష్‌బాబు మాట్లాడారు. జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభ డిసెంబరు 10న విజయవాడలోని జింఖానా మైదానంలో జరుగుతుందన్నారు. మహాసభకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఇతర పెద్దలనూ ఆహ్వానించామన్నారు. వారి ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించబోతున్నట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేటు ఏజెన్సీల బారి నుంచి తప్పించి ఆప్కాస్ ఏర్పాటుతో ప్రభుత్వం ఊరట కల్పించిందన్నారు. అయితే కనీస వేతనం అమలు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు సతమతమవుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించాలని కోరనున్నట్లు తెలిపారు. మహాసభకు ఉద్యోగులు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ అసోసియేట్ చైర్మన్ మల్లరాముడు, నాయకులు రమేష్, పి.రామకృష్ణ, రాఘవేంద్ర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హేమలత ఆత్మహత్యకు వేధింపులే కారణం

- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు

అనంతపురం క్రైం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయి హేమలత (28) ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణమని అనంతపురం నాల్గో పట్టణ సీఐ ప్రతాపరెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో అత్తతో పాటు భర్త, అతని తమ్ముడు, ఆడపడుచుని అరెస్ట్ చేసినట్లు వివరించారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన సాయి హేమలతకు అనంతపురం నగర శివారులోని పీవీకేకే కళాశాల సమీపంలో నివాసముంటున్న కళ్యాణ చక్రవర్తితో 9 నెలల క్రితం వివాహమైంది. అత్తారింట్లో కాలు పెట్టినప్పటి నుంచి అదనపు కట్నం కోసం ఆమెను భర్త, ఆయన కుటుంబసభ్యులు వేధించేవారు. విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే సాయి హేమలతకు ప్రతి నెలా వచ్చే వేతనాన్ని ఎప్పటికప్పుడు కళ్యాణ్ తన ఖాతాలోకి మళ్లించుకునేవాడు. కనీస ఖర్చులకు సైతం డబ్బు ఇచ్చేవాడు కాదు. గత వారం భర్త, కుటుంబసభ్యులు ఉత్తర కర్ణాటక సందర్శనకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని సాయి హేమలతకు తెలపడంతో ఆమె రుతుక్రమ ఇబ్బందుల కారణంగా యాత్రను వాయిదా వేయాలని కోరింది. దీంతో ఆమె మనోభావాలను కించపరిచేలా మాట్లాడి కుటుంబసభ్యులతో కలసి యాత్రకు భర్త తరలివెళ్లాడు. టూర్‌లో ఉన్న భర్తకు ఆమె పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిహేమలత గత ఆదివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై సాయి హేమలత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు నిర్ధారణ కావడంతో కళ్యాణ్‌చక్రవర్తి, లక్ష్మీనరసమ్మ, కుమార్ ప్రేమ్ సాయి, వరలక్ష్మిపై వేధింపుల కేసు నమోదు చేసి, మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన హెచ్చెల్సీ కోటా

అనంతపురం సెంట్రల్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది జిల్లాకు అందాల్సిన హెచ్చెల్సీ నీటి కోటా పూర్తయింది. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో నీటిని నిలుపుదల చేశారు. ఇప్పటి వరకూ 17.363 టీఎంసీల నీటిని విడుదల చేయగా ప్రవాహ నష్టాలు పోనూ జిల్లా సరిహద్దులో 16.070 టీఎంసీలు చేరినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 495 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6,802 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదులుతున్నారు. కనిష్టంగా 14.814 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జిల్లాలోని పీఏబీఆర్‌లో 2.403 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 0.605 టీఎంసీలు నీటి నిల్వ ఉన్నట్లు ఎస్‌ఈ రాజశేఖర వివరించారు.

నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి



చికిత్స పొందుతున్న దేవి



పోలీసులు అదుపులో ఉన్న నిందితుడు రవి

గుత్తి: అనుమానం పెనుభూతమైంది. తాగుడుకు బానిసైన వ్యక్తి చివరకు నిద్రిస్తున్న తన భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎస్సీ కాలనీకి చెందిన రవి, దేవి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. మద్యానికి బానిసైన రవి జులాయిగా మారాడు. ఈ క్రమంలోనే మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ భార్యను వేధించేవాడు. దీనికి తోడు కొన్ని రోజులుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యపై గొడలితో దాడి చేశాడు. తలపై మూడు సార్లు నరికాడు. రక్తపు మడుగులో పడి ఉన్న దేవిని చూసి చనిపోయిందని భావించి పరారయ్యాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే దేవిని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రవిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దారుణహత్య



హతుడు నాగార్జున

యల్లనూరు: భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న పరస్పర దాడుల్లో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం మేడికుర్తికి చెందిన నాగార్జున, నిట్టూరు నివాసి ఆర్.వెంకటరెడ్డికి ఆయా గ్రామాల సరిహద్దున పొలాలు ఉన్నాయి. ఆ పొలాల మధ్య గట్టు విషయంగా ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. గట్టు మాదంటే మాదంటూ ఇద్దరూ తరచూ ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో భూ సర్వే చేయించారు. సర్వే అనంతరం నిర్దేశించిన హద్దుల్లో మంగళవారం ఉదయం వెంకటరెడ్డి స్తంభాలను పూడుస్తుంటే అక్కడే ఉన్న నాగార్జున, అతని చిన్నాన్న కంబగిరి అడ్డుకున్నారు. ఆ సమయంలో గొడవ తారాస్థాయికి చేరుకుంది. వెంకటరెడ్డి, ఆయన కుమారుడు పెద్దిరెడ్డి గడ్డపారతో నాగార్జున (36) తలపై బాదడంతో తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక నాగార్జున మృతి చెందాడు. ఇదే ఘటనలో గాయపడిన కంబగిరి చికిత్స పొందుతున్నాడు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి

బ్రహ్మసముద్రం : ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లి, బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లి గ్రామాల నుంచి బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లికి వ్యవసాయ పనుల కోసం కూలీలు మంగళవారం ఉదయం ఓ ఆటోలో బయల్దేరారు. కన్నేపల్లి సమీపంలోకి చేరుకోగానే రాంగ్ రూట్‌లో వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లికి చెందిన జయలక్ష్మి, పుష్పావతి, సరోజమ్మ, గంగమ్మ, శాంతమ్మ, బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లికి చెందిన కదిరక్క, చిత్రావతి, ముద్దలాపురం నివాసి ఆటో డ్రైవర్ తిమ్మప్ప తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జయలక్ష్మి (43)ని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మంగళవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆమె వ్యక్తిగత సహాయకుడు దేవదాసు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

వ్యక్తి దుర్మరణం

గార్లదిన్నె: విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కేశవాపురానికి చెందిన నాగేంద్ర (38), కల్లూరులో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి గార్లదిన్నె నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతూ కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై అంబేడ్కర్ సర్కిల్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో నేరుగా వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన అఫ్రోజ్

గుంతకల్లు టౌన్: కుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని అల్లీపీరా కాలనీకి చెందిన షేక్ నూర్ మహమ్మద్, నస్రీన్ దంపతుల మూడేళ్ల వయసున్న కుమార్తె అఫ్రోజ్... ఓ ప్రైవేట్ స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం తల్లి స్కూల్ వద్దకెళ్లి కుమార్తెను పిలుచుకుని ఇంటికి వెళుతుండగా చిన్నారిపై వీధి కుక్క దాడి చేసింది. స్థానికులు వెంటనే కుక్క బారి నుంచి తల్లీబిడ్డను కాపాడి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీధుల్లో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఈ సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి విన్నవించారు.

లింగ నిర్ధారణ చట్టంపై చైతన్య పరచండి

- వైద్యాధికారుల సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



మాట్లాడుతున్న డాక్టర్ భ్రమరాంబదేవి (చిత్రంలో) వైద్యాధికారులు

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణ చట్టం, చట్టం అతిక్రమణతో ఎదురయ్యే ఇబ్బందులు, ఆడబిడ్డ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు విస్తృతం చేయాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. మంగళవారం ఉదయం తన చాంబర్‌లో వైద్యాధికారులతో ఆమె సమావేశమయ్యారు. వివిధ పీహెచ్‌సీల వారీగా వైద్యులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి పీహెచ్‌సీలో నెలకు పది ప్రసవాలు తప్పక జరగాలన్నారు. పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సంబంధించిన అన్ని భవనాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. దృష్టి లోపం బాధపడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో గుర్తించిన ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెఫరల్ కేసులకు వైద్యం పూర్తి స్థాయిలో అందాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఓ గిరిజామనోహర్, స్టాటిస్టిక్స్ అధికారి మారుతీప్రసాద్, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు 'సెంట్రల్' విద్యార్థిని



సంహిత

అనంతపురం: జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయ ఆరో తరగతి విద్యార్థిని తాడిమర్రి సంహిత ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ఆమెను జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రెటరీ జ్యోతిమేరీ తెలిపారు. ఈ సందర్భంగా సంహితను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కరీంఖాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్



అనంతపురం అగ్రికల్చర్: మామిడిలో పూమొగ్గ రావడానికి వాతావరణం అనుకూలంగా ఉన్న కీలక సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వేలాది ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నందున రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ పరిస్థితులను బట్టి మామిడిలో పూమొగ్గ తొడగడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. డిసెంబర్ మొదటి వారంలో ఒక నీటి తడి ఇవ్వాలన్నారు. ఈలోపు ఒక పదును వర్షం వస్తే నీటి తడి కూడా అవసరం లేదన్నారు. పూత ఆరోగ్యంగా రావడానికి ఒక లీటర్ నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ + 2 గ్రాములు సల్ఫర్ కలిపి వెంటనే పిచికారీ చేయాలన్నారు. మళ్లీ వారం రోజుల తర్వాత లీటర్ నీటికి 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మళ్లీ వారం తర్వాత ఒక లీటర్ నీటికి 10 గ్రాములు 13-0-45 + 2 మి.లీ క్లోరిపైరిపాస్ లేదా 1.5 మి.లీ లాంబ్డాసైహాలోత్రిన్ కలిపి పిచికారీ చేస్తే పూత, పిందె, దిగుబడులు బాగా వస్తాయన్నారు. పిచికారీ సమయంలో కాండం బాగా తడిచేలా చూసుకుంటే బెరడులోపల ఉన్న తేనెమంచు పురుగు నశిస్తుందన్నారు.

క్లుప్తంగా

పీటీడీ అసోసియేషన్ హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అనంతపురం డిపో కార్యాలయం ఎదుట టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోనిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు సీఎస్‌రెడ్డి, డిపో కార్యదర్శి సోమశేఖరరెడ్డి, నాయకులు వెంకటేష్, మాధవయ్య, ఏఆర్‌రెడ్డి, తేజ, గంగాధర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు డిసెంబర్ 13లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ నరసింహారెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో 'ఆడుదాం ఆంధ్రా'కు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 15 ఏళ్ల పైడిన స్త్రీ, పురుషులు ఈ క్రీడల్లో పాల్గొనొచ్చన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బ్యాడ్మింటన్ క్రీడలు ఉంటాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో మెదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు అందజేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని (డిసెంబర్ 1న) అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారులతో డీఎంహెచ్ఓ సమావేశమయ్యారు. కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ మాట్లాడుతూ హైస్కూల్, కళాశాల విద్యార్థులకు ఈ నెల 20 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, జిల్లా ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ గిరిధర్, డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీవీ రమణ, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యవసాయాధికారులకు సన్మానం



విశ్రాంత అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కృషీభవన్‌లో వ్యవసాయశాఖ విశ్రాంత అధికారులు పలువురు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా రెండో శనివారం సమావేశం కావాలని నిర్ణయించారు. 75 ఏళ్ల వయస్సు దాటిన కొందరు విశ్రాంత అధికారులను శాలువా, పూలమాలతో సత్కరించి, వారి సేవలు కొనియాడారు. విశాంత అధికారులు రమణ, సుబ్బారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, చంద్రమౌళి, మల్లి కార్జున, లోకనాథ రెడ్డి, రంగస్వామి, చెన్నారెడ్డి, విశ్వనాథ్, గురుమూర్తి, కొండయ్య, చంద్రా యుడు, అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి పాల్గొన్నారు.

నేడు జేవీవీ సమాలోచన

అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో బుధవారం సాయంత్రం 5:30 గంటలకు సమాలోచన కార్యక్రమం ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ క్రికెట్ కప్ – పొలిటికల్ ఎకానమీ, వారానికి 70 గంటల పని అనే అంశాలపై చర్చా వేదిక ఉంటుందన్నారు. విద్యావంతులు, మేధావులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరుగులేని పార్టీగా నిలబెట్టండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని, లబ్ధిదారుల ఖాతాల్లో రూ.3.80 లక్షల కోట్లు జమ చేసిందని, గతంలో ఏపార్టీ అయినా ఇంతటి అభివృద్ధి, సంక్షేమం అందించిందా?.. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించి వైఎస్సార్‌సీపీనితిరుగులేని పార్టీగా నిలబెట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 5, 41, 51, 15వ సచివాలయాల పరిధిలోని వేణుగోపాల్ నగర్, హౌసింగ్‌బోర్డు, మారుతీనగర్, రాజమ్మకాలనీల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. 51వ సచివాలయ పరిధిలోని మారుతీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని, సంక్షేమ, అభివృద్ధి బోర్డు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ఓటు వేసినా, వేయకున్నా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఓటు వేయకుంటే పింఛన్‌ను తొలగించిన ప్రభుత్వాన్ని చూశామన్నారు. 51వ సచివాలయ పరిధిలో రూ.26.03 కోట్ల సంక్షేమాన్ని అందించామన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. నగరంలో 23వేల ఇంటి స్థలాలు మంజూరు చేశామన్నారు. రూ.800 కోట్ల అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలన్నారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, మహిళలందరూ నడుం బిగించి వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.





మారుతీనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత , కార్యక్రమానికి హాజరైన ప్రజలు

40 ఏళ్లలో లేని విధంగా అభివృద్ధి..

మేయర్ వసీం మాట్లాడుతూ నగర చరిత్రలో 40 ఏళ్లలో లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలతో పథకాలు అందేవన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ కొండ్రెడ్డి రాధ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. డివిజన్‌లో రూ.7.5 కోట్ల అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, సంపంగి రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నేత అనంత చంద్రారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, శ్రీదేవి, క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, జగదీష్, మధు, ఓబిరెడ్డి, జేసీఎస్ లక్ష్మన్న, చింతకుంట మధు, వీరా రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు నాగరాజు రెడ్డి, లోకనాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నరసింహులు, రాజేష్ పాల్గొన్నారు.

41వ సచివాలయ పరిధిలో రూ.22.70 కోట్ల సంక్షేమం

గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. 41వ సచివాలయ పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. మరోమారు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు.

చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్రాభివృద్ధి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఎంపీపీ హేమలత, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు సచివాలయం–2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు అందిన పథకాల బోర్డును ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ.34 కోట్ల మేర అభివృద్ధి జరిగిందన్నారు. కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రాముడు, బిల్లే ముత్యాలన్న, ఫణిరెడ్డి, ఈశ్వరరెడ్డి, అంజినప్ప, నాగరాజు, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్, నరసింహులు, రామునాయక్, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్, గోపాల్, ప్రసాద్, రామాంజి, మాదన్న తదితరులు పాల్గొన్నారు.



41వ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన మహాలక్ష్మి శ్రీనివాస్



ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

కనగానపల్లి (రాప్తాడు): ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని రాప్తాడు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాప్తాడులో మండలంలోని గాండ్లపర్తిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశమై, సంక్షేమ పథకాల బోర్డులు ప్రదర్శించారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ రాముడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గాండ్లపర్తిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

మీ సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా



ఎంపీ రంగయ్యకు వినతిపత్రం అందిస్తున్న తపాలా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు

అనంతపురం సిటీ: మీ సమస్యలు న్యాయమైనవే.. వాటి పరిష్కారంపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తా అని అనంతపురం పార్లమెంట్ సభ్యుడు తలారి రంగయ్య తపాలా ఉద్యోగులకు హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో తపాలా ఉద్యోగులు, సంఘం ప్రతినిధులు ఎంపీ రంగయ్యను ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. తమ సమస్యలు విన్నవించారు. ఆయనకు వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీ రంగయ్య సానుకూలంగా స్పందించారు. యూనియన్ ప్రతినిధులు సూర్యనారాయణరెడ్డి, వెంకటరమణ, కిష్టయ్య, చాంద్‌బాషా, నాగేశ్వర్‌రెడ్డి, రామ్మూర్తి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి

అనంతపురం:బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహాత్ములకు మరణం లేదని, వారు ఎప్పటికీ ప్రజల గుండెల్లో కొలువై ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ , కావేరి, జీఎం బాషా, విజయ, ఉజ్జినేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ప్రతినిధులు కోరారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా అనంతకు వచ్చిన మైనార్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు షెక్షావలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మైనార్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో అన్యాయం జరుగుతోందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని, ఉర్దూ పాఠశాలల పనితీరుపై దృష్టి సారించాలని ఉపాధ్యక్షుడు జిలాన్, కోశాధికారి దౌలా, అదనపు కార్యదర్శి అన్వర్, ఇమ్రాన్ కోరారు.



మైనార్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆల్‌మేవా నాయకులు

అధికారులు పట్టించుకోలేదని వినతి

అనంతపురం అర్బన్: భూమి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని డీఆర్ఓ గాయత్రిదేవికి బెళుగుప్ప మండలం కాలువపల్లికి చెందిన బాధితుడు రామకృష్ణాచారి ఫిర్యాదు చేశారు. డీఆర్ఓను మంగళవారం కలెక్టరేట్‌లో బాధితుడు కలిసి వినతిపత్రం అందజేసి, సమస్య విన్నవించాడు. సర్వే నంబరు 70–4లో 95 సెంట్ల పట్టా భూమి తనకు తండ్రి నుంచి సంక్రమించిందన్నాడు. ఆర్‌హెచ్, ఈసీలోనూ తన పేరు ఉందని తెలిపారు.

- తమ భూమిని జగనన్న లేఅవుట్ కోసం తీసుకొని డబ్బులు జమ చేయకుండానే ఆన్‌లైన్‌లో తమ పేర్లను తొలగించారని డీఆర్ఓకు బాధితులు ఫిర్యాదు చేశారు. రాచానపల్లి పొలం 20 ఎకరాల భూమిని జగనన్న కాలనీ కోసం ఎనిమిది మంది రైతుల నుంచి సేకరించారన్నారు. ఎకరాకు పరిహారం రూ.24 లక్షలు ధర నిర్ణయించారన్నారు. అయితే తమకు పరిహారం ఇవ్వకుండానే వెబ్‌లాండ్‌లో పేర్లు తొలగించారన్నారు.



డీఆర్ఓ గాయత్రిదేవికి విన్నవిస్తున్న బాధితులు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. కార్తీక మాసం పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

సుంకులమ్మకు ఘనంగా పూజలు



సుంకులమ్మగుడిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: పాతూరు చెరువుకట్టపై వెలసిన కొత్తకోట సుంకులమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి పూజారమ్మ బెస్త వరలక్ష్మి పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సుధీర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత..సకల సమస్యలకు పరిష్కారం

అనంతపురం కల్చరల్: భగవద్గీత సకల సమస్యల పరిష్కారమార్గమని, ప్రతి ఒక్కరూ నిత్య అభ్యసనం చేయాలని ఉడుపి పుత్తిగె పీఠం మఠాధిపతులు సుగుణేంద్రతీర్థ శ్రీపాదుల స్వామీజీ ప్రబోధించారు. మంగళవారం అనంతకు వచ్చిన పీఠాధిపతి సుగుణేంద్రతీర్థులు, ఉత్తరాధికారి సుశ్రీంద్రతీర్థ శ్రీపాదులకు భక్తులు స్వాగతం పలికారు. మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం నుంచి మూడోరోడ్డులోని శ్రీకృష్ణ మఠం వరకు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. శ్రీకృష్ణ మఠం మేనేజర్ లక్ష్మీనారాయణాచార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగవద్గీత వైశిష్ట్యంపై అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ ఉడుపిలో పెద్ద ఎత్తున భగవద్గీత కోటియజ్ఞం జరుగుతోందన్నారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా తిరుగుతూ ప్రతి పాఠశాల చిన్నారి భగవద్గీతలోని సారాంశం గ్రహించేలా ఉచితంగా భగవద్గీత పుస్తకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఆయన స్వయంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



కృష్ణమఠంలో చిన్నారులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ

రాప్తాడు ఓటర్లూ.. తస్మాత్ జాగ్రత్త!

- 50 వేల ఓట్ల తొలగింపునకు పరిటాల సునీత కుట్ర
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: ఓటమి భయంతో టీడీపీ నాయకులు రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల ఓట్ల తొలగింపునకు సిద్ధమయ్యారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని భానుకోట గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దౌర్జన్యంగా ఎన్నికల్లో రిగ్గింగు చేసిన చరిత్ర పరిటాల రవిది అన్నారు. కర్ణాటక నుంచి దొంగ ఓటర్లను తెచ్చుకొని గెలిచిన చరిత్ర పరిటాల సునీతది అని విమర్శించారు. ఇప్పుడు దొంగే దొంగ అన్నట్లుగా రాప్తాడు నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేయడం సిగ్గుగా ఉందన్నారు. ఇందుకోసం ఆమె ఇప్పటికే తన పార్టీ కార్యకర్తల ద్వారా 27 వేల ఓట్లు తొలగించాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయించి, మరో 23 వేల దరఖాస్తులు సిద్ధం చేసినట్లు తెలుస్తోందన్నారు. కానీ వీటి కోసం ఓటర్లే దరఖాస్తు చేసినట్లు సృష్టించి, వాటి తొలగింపునకు అధికారులను బెదిరించేందుకు పూనుకున్నారన్నారు. వీటి తొలగింపునకు కోర్టులకు వెళ్తామని చెప్తున్నారని, దీనిద్వారా ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. కాగా ఈ ఓటర్లంతా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నవారేనని, నియోజక వర్గంలోని ఓటర్లంతా తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదా అని పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భానుకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


శాస్త్రీయ నృత్యంలో ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అరవింద నృత్య కళానిలయం ఆధ్వర్యంలో 6 నెలల పాటు కూచిపూడి నాట్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డ్యాన్స్ మాస్టర్ సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం డ్యాన్స్ స్కూల్ ప్రారంభించి, మాస్టర్లకు అవకాశం ఇస్తామన్నారు. డిసెంబరు 1 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమై, వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగుతుందన్నారు. బుధవారం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని, మరిన్ని వివరాలకు హౌసింగు బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని శ్రీనివాసనగర్ విద్యుత్ ఫీడర్ కింద ఉన్న రామచంద్రనగర్, శ్రీనివాస నగర్, రైల్వేస్టేషన్, సైపుల్లా బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుంది. 11 కేవీ లైన్లు పునరుద్ధరిస్తుండడంతో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని విద్యుత్ శాఖ ఈఈ రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కక్కలపల్లి గ్యాస్ లీక్ ఘటనలో మరొకరి మృతి



రామాంజనమ్మ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో గ్యాస్ లీకైన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామాంజనమ్మ మృతిచెందింది. వివరాలు.. కక్కలపల్లికి చెందిన బోయ వెంకట్రాముడు, రామాంజనమ్మ దంపతులతో పాటు వెంకట్రాముడు తమ్ముడి కుమారుడు హేమంత్ ఈ నెల 16న రాత్రి ఇంట్లో నిద్రించారు. 17న వేకువజామునే వెంకట్రాముడు బాతురూం కెళ్లి స్నానం కోసమని గీజర్‌కు అమర్చిన ట్యాప్‌ను ఆన్ చేయగానే పెద్దశబ్దంతో పేలింది. అప్పటికే ఇల్లు మొత్తం గ్యాస్ వ్యాపించి ఉండడంతో ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. ఘటనలో వెంకట్రాముడుతో పాటు బెడ్‌రూంలో నిద్రిస్తున్న రామాంజనమ్మ, హేమంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత సర్వజనాస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ నెల 21న హేమంత్ మృతి చెందాడు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనమ్మ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. వెంకట్రాముడు చికిత్స పొందుతున్నాడు.

జగన్‌తోనే అన్నివర్గాలకూ న్యాయం

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలోని అన్నివర్గాలకూ న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచు సిద్ధన్న తెలిపారు. మంగళవారం మండలంలోని ఎంసీపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రాష్ట్రాభివృద్ధిని, ప్రజలను విస్మరించాయన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ మీనుగ నాగరాజు, ఎంపీటీసీ రామ్మోహన్, నాయకులు ఎజ్జే అంజి, రాజగోపాల్‌రెడ్డి, జిలకర లింగారెడ్డి, కొల్లప్ప, మహాత్మ, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.